మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
శుక్రవారం 27 ఫిబ్రవరి 2026 పేజీలు : 4

## అమరావతికి ప్రధాన న్యాయమూర్తి..

* మార్చి 1న అమరావతికి భారత ప్రధాన న్యాయమూర్తి రాకతో జిల్లా కలెక్టర్ల తో సమీక్ష నిర్వహించిన శ్యామలరావు...

అమరావతిలో న్యాయ వసతుల విస్తరణకు ప్రధాన న్యాయమూర్తి చేత శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

వివరాలు 2లో..



- జిల్లా నడిబొడ్డులో ఎంతో విలువ చేసే ప్రభుత్వ భూమి...
- మూత్రశాలగా మారితే ఎవరి బాధ్యత?
- బాపట్ల గడియార స్తంభం వెనుక
- ప్రభుత్వ స్థలంపై అధికారుల నిర్లక్ష్యం
- 18 నెలలుగా చర్యలు లేవు...
- ఎమ్మెల్యే నరేంద్ర వర్మ దృష్టికి వెళ్లలేదా?

## బాపట్ల గుండెల్లో దుర్గంధ పాలన..




బాపట్ల జిల్లా కేంద్రం నడిబొ డ్డులో ఎంతో విలువ చేసే ప్రభుత్వ స్థలం ప్రజా మూత్రశాలగా మారడం పాలనా వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనంగా మారింది. గడియార స్తంభం వెనుక భాగాన ఉన్న ఈ స్థలం నుంచి రోజు మొత్తం దుర్గంధం వెదజల్లుతున్నా, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడటం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినా ఈ భూమిపై స్పష్టమైన నిర్ణయం లేదు. మున్సిపాలిటీకి నెలల వారీగా కొంత ఆదాయం అయినా వచ్చే అవకాశం ఉన్నా, అధికారుల నిర్లక్ష్యమే దీనిని మూత్రశాల కేంద్రంగా మార్చింది.

బాపట్ల జిల్లా రక్షణ బ్యూరో

జిల్లా కేంద్రం గుండెల్లో ఉన్న ప్రభుత్వ స్థలం పరిస్థితి చూస్తే, బాపట్లలో పరిపాలన ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవు తోంది. గడియార స్తంభం వెనుక భాగాన ఉన్న ఈ స్థలం ఒక ప్పుడు గ్రామ సావిడి, ఆ తర్వాత మున్సిపాలిటీ పరి ధిలోకి తీసుకున్న

మిగతా 2లో

## ఏపీలో 'నో హెల్మెట్ నో ఫ్యూల్' ప్రతిపాదన..

- రోడ్డు భద్రతపై అసెంబ్లీలో
- ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు కీలక సూచన
- ద్విచక్ర వాహనదారుల ప్రాణాల
- రక్షణకు వినూత్న చర్య అవసరం



నవ్యాంధ్రప్రదేశ్ అభ్యుదయంతో పాటు ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తున్న గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతోందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు 'నో హెల్మెట్ -- నో ఫ్యూల్' నిబంధనను ఏపీలో అమలు చేయాలని ఆయన అసెంబ్లీలో ప్రతిపాదించారు. వివరాలు 2లో..


## బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్ పై ప్రభుత్వం దృష్టి

రూ.3.25 కోట్ల ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వ కఠిన చర్యలు
కోర్టులో కౌంటర్‌కు సిద్ధం



బాపట్ల మండలం వెస్ట్ బాపట్ల గ్రామపం చాయతీ పరిధిలోని బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్ చెల్లించాల్సిన రూ.3.25 కోట్ల ఆస్తి పన్ను బకాయిల అంశం రాష్ట్ర స్థాయిలో ప్రాధాన్యత సంతరించుకుంది. పంచాయతీరాజ్ కమిషనర్ సమీక్ష అనంతరం అధికారులు కఠిన చర్యలకు సిద్ధమవుతుండగా, కేసు ప్రస్తుతం హైకోర్టులో విచారణలో ఉంది. వివరాలు 2లో..

## పర్యవేక్షణ లోపంతో అంగన్వాడీలు తాళాలకే పరిమితం



- కొనకనమిట్ల మండలంలో అంగన్వాడీ వ్యవస్థపై ప్రశ్నలు
- పిల్లల పోషణ, భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన

కొనకనమిట్ల మండలంలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిబ్బంది విధులకు హాజరుకాకపోవడం, తనిఖీలు లేకపోవడం వల్ల చిన్నారుల సంక్షేమ పథకాలు నిర్వీర్యమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షణ లోపమే ఈ పరిస్థితికి కారణమని గ్రామస్తులు అంటున్నారు.

అమరావతి రక్షణ న్యూస్

కొనకనమిట్ల మండలంలోని గార్లదీన్నె గ్రామంలో అంగన్వాడీ కేంద్రం నిర్వహణలో తీవ్ర లోపాలు వెలుగుచూశాయి. కేంద్రం తలుపులు తెరిచి ఉన్నప్పటికీ సిబ్బంది విధులకు హాజరుకాకపోవడం స్థానికంగా కలకలం రేపింది. పిల్లల కోసం ఏర్పాటు చేసిన కేంద్రం

మిగతా 2లో

# ఏపీలో 'నో హెల్మెట్ -- నో ఫ్యూయల్' ప్రతిపాదన..

మొదటి పేజీ తరువాయి

**అమరావతి రక్షణ న్యూస్**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ, ప్రజల ప్రాణాల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. విజనరీ నాయకుడైన చంద్రబాబు నాయుడు గారి సుపరిపాలనలో ప్రతి పౌరుడి జీవితం అమూల్యమని, వారి భద్రత కోసం వినూత్న చట్టాలు తీసుకురావడంలో ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అమలు చేస్తున్న 'నో హెల్మెట్ -- నో ఫ్యూయల్' విధానం ద్వారా ద్విచక్ర వాహనదారుల మరణాలు గణనీయంగా తగ్గాయని గుర్తు చేశారు. అదే విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రవేశపెడితే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పెట్రోల్ బంకుల్లో హెల్మెట్ ధరించిన వారికి మాత్రమే ఇంధనం ఇచ్చే విధానం అమలు చేస్తే వాహనదారుల్లో క్రమశిక్షణ పెరుగుతుందని, ఇది 'సురక్షిత ఆంధ్రప్రదేశ్' నిర్మాణానికి దోహదపడుతుందని వివరించారు. ప్రజా శ్రేయస్సుపై నిరంతరం దృష్టి పెట్టే చంద్రబాబు నాయుడు గారు ఈ ప్రతిపాదనను పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి గారి సమర్థవంతమైన పాలనలో ఈ నిబంధన త్వరలోనే కార్యరూపం దాల్చుతుందని, బాపట్ల నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు తెలిపారు

# బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్ పై ప్రభుత్వం దృష్టి

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ న్యూస్**

వెస్ట్ బాపట్ల గ్రామపంచాయతీ పరిధిలోని బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్ (బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ) చెల్లించవలసిన రూ. 3.25 కోట్ల ఆస్తి పన్ను బకాయిలు రాష్ట్ర స్థాయిలో తీవ్ర చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై సంబంధిత సంస్థ గౌరవ హైకోర్టును ఆశ్రయించడంతో కేసు ప్రస్తుతం న్యాయపరమైన విచారణలో ఉంది. ఇటీవల గౌరవ పంచాయతీరాజ్ కమిషనర్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశంలో, అధిక మొత్తంలో పెండింగ్ ఉన్న సంస్థల జాబితాలో బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్ పేరు ఉండటంతో ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో ప్రస్తావించారు. దీంతో తక్షణ చర్యలు చేపట్టాలంటూ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి గారు వెస్ట్ బాపట్ల గ్రామపంచాయతీని సందర్శించి, కోర్టులో నడుస్తున్న కేసుకు సంబంధించిన ఫైళ్లను సవివరంగా పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గౌరవ హైకోర్టులో సమర్పించాల్సిన కౌంటర్ అఫిడవిట్‌పై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. అవసరమైన రికార్డులు, అసెస్మెంట్ వివరాలు, డిమాండ్ నోటీసులు సిద్ధం చేసి ప్రభుత్వ న్యాయవాదితో సమన్వయం కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ కేసు విచారణను మార్చి 10, 2026 తేదీకి వాయిదా వేశారు. గ్రామపంచాయతీ అభివృద్ధికి కీలకమైన ఆదాయాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా చట్టపరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి శ్రీ కేవీ ప్రభాకర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. బాబురావు, డిప్యూటీ ఎంపీడీవో జి. రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సిహెచ్. రవి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల గుండెల్లో దుర్గంధ పాలన.

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ ఆస్తి. కాలక్రమంలో దీనిపై పలువురు నాయకులు కన్నేసి, సొంతం చేసుకునే ప్రయత్నాలు జరిగిన దశలో అప్పటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ జోక్యంతో మున్సిపాలిటీకి ఆదాయం చేకూరేలా షాపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే నిర్మాణాలు ప్రారంభమైన వెంటనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత, అప్పటి ఎమ్మెల్యే కోన రఘుపతి ఆ నిర్మాణాలను అనధికారిక కట్టడాలుగా గుర్తించి, ఏ ఉద్దేశంతో చేశారో తెలియదు గానీ నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారు.

**ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది.**

కూల్చిన తర్వాత ఆ స్థలాన్ని ప్రభుత్వానికి ఉపయోగపడేలా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఎవరిది? ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ భూమిపై ఒక్క రూపాయి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోలేదు. ఫలితంగా నేడు జిల్లా నడిబొడ్డులో ఉన్న ఈ ఎంతో విలువైన భూమి చెత్తకుప్పగా, ప్రజా మూత్రశాలగా మారింది.

ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు బాపట్ల గడియార స్తంభం పరిసరాల్లో పోలీసులు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు జిల్లా అభివృద్ధిపై చర్చలు చేస్తూ కనిపిస్తారు. కానీ అదే నాలుగు రోడ్ల మధ్యలో, వాళ్ల కళ్ల ముందే ఉన్న ఈ మూత్రశాల కేంద్రాన్ని చూసి కూడా చూసి చూడనట్లుగా వ్యవహరించడం ప్రజల్లో తీవ్ర అసహనాన్ని కలిగిస్తోంది.

కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినప్పటికీ, ఈ స్థలం ఎందుకు ఖాళీగా ఉంది? మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నారు? ఈ అంశం ఎందుకు ఇప్పటి వరకు ప్రజా ప్రతినిధుల దృష్టికి వెళ్లలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమాచారం ప్రకారం, ఈ విషయాన్ని ఎవరూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లలేదని తెలుస్తోంది.

ప్రస్తుత బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మకు ఈ అంశం పూర్తిగా తెలియదా? లేక అధికారులు కావాలనే ఆయన దృష్టికి తీసుకురాలేదా? అన్నది ఇప్పుడు రాజకీయ, పరిపాలనా వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది. మున్సిపాలిటీ పరిధిలోని ఈ భూమిపై ప్రభుత్వానికి సంబంధించిన ఏదైనా కార్యాలయం ఏర్పాటు చేసి ఉంటే, ఈ రోజు ఈ స్థలం మూత్రశాలగా మారే పరిస్థితి ఉండేదే కాదని ప్రజల నుంచి తీవ్ర వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నెలకు కొంత ఆదాయం అయినా మున్సిపాలిటీకి వచ్చేది.

కానీ ప్రస్తుతం ఈ స్థలం బాటసారులు, ప్రజలు మూత్ర విసర్జనకు ఉపయోగించుకోవాల్సిన దయనీయ స్థితికి చేరింది. దుర్గంధంతో పాటు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నా, మున్సిపల్ శాఖ నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే, జిల్లా కేంద్రానికి వచ్చే పర్యాటకులు, ఉన్నతాధికారులు ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి తప్పదన్న ఆవేదన స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

**ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం మేల్కొనాలి.**

ఈ అంశాన్ని తక్షణమే ఎమ్మెల్యే నరేంద్ర వర్మ దృష్టికి తీసుకెళ్లి, స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ భూమిని మూత్రశాలగా మార్చిన ఈ పరిస్థితిపై చర్యలు తీసుకోకపోతే, ఇది కేవలం పరిపాలనా వైఫల్యంగానే కాకుండా ప్రభుత్వ నిర్లక్ష్యానికి శాశ్వత ముద్రగా మిగిలిపోతుందన్న హెచ్చరికలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

# అమరావతికి ప్రధాన న్యాయమూర్తి..

మొదటి పేజీ తరువాయి

భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి మార్చి 1వ తేదీన అమరావతికి రానున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయ వ్యవస్థకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామల రావు గురువారం వీడియో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. మధ్యాహ్నం 4 గంటలకు ఏపీ న్యాయ అకాడమీ భవనానికి, ఏపీ హైకోర్టు అతిథి గృహ భవనానికి శంకుస్థాపన చేయడంతో పాటు, హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. న్యాయ వ్యవస్థకు ఆధునిక వసతులు కల్పించడం, న్యాయ సేవల సామర్థ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్రంలో న్యాయ వ్యవస్థ బలోపేతానికి ఈ కార్యక్రమాలు దోహదపడనున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

# పర్యవేక్షణ లోపంతో అంగన్వాడీలు తాళాలకే పరిమితం

మొదటి పేజీ తరువాయి

ఖాళీగా ఉండగా, అక్కడ వీధి కుక్కలు తిరుగుతున్న దృశ్యాలు గ్రామస్తులను ఆందోళనకు గురిచేశాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ, ఆరోగ్య పథకాలు క్రమం తప్పకుండా అమలవ్వాలంటే అంగన్వాడీ కేంద్రాలే పునాది అని గ్రామస్తులు చెబుతున్నారు. కానీ పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది నిర్లక్ష్యం పెరిగి, చిన్నారుల భవిష్యత్తుపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సిడిపిఓ స్థాయిలోనూ తరచు తనిఖీలు జరగకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు కొనసాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అంగన్వాడీల్లో జరుగుతున్న లోపాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, పిల్లల సంక్షేమం కాగితాలకే పరిమితం కాకుండా భూమిపై కనిపించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు

# సామాజిక బాధ్యతే జర్నలిజం..

## జర్నలిజంలో అర్హత కలిగిన మీడియా ప్రతినిధులకు అక్రిడేషన్ కార్డులను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా..

**గుంటూరు రక్షణ న్యూస్**



సమాజ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లే శక్తి మీడియాకు ఉందని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మీడియా అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా గళాన్ని ప్రభుత్వానికి చేరవేసే వేదికగా మీడియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో మీడియా భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని కోరారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో మీడియా ముందుండాలని సూచించారు. నిష్పక్షపాతంగా, సామాజిక బాధ్యతతో పనిచేసే జర్నలిజం సమాజాన్ని సుస్థిర అభివృద్ధి దిశగా నడిపిస్తుందని అన్నారు. అర్హత కలిగిన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేయని వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, తదుపరి జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో పరిశీలించి మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మరియు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేరాల అరికట్టే దిశగా పోలీసుల దృఢచర్యలు..

**జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఎస్టీ కాలనీలో కార్డెన్ సెర్చ్ -- అసాంఘిక కార్యకలాపాలకు కఠిన చర్యలు: ఎస్సై హెచ్చరిక**

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లాను నేరరహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా నిఘాను మరింత ఉధృతం చేశారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని ఎస్టీ యానాది కాలనీలో చందోలు ఎస్సై మద్రి వెంకట శివకుమార్ తన సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, స్థానికుల వివరాలను సేకరించారు. ఈ తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు గుర్తించారు. వాహన యజమానులు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలు చూపలేకపోవడంతో ఆయా వాహనాలను స్వాధీనం చేసుకుని చందోలు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై మద్రి వెంకట శివకుమార్ మాట్లాడుతూ, కాలనీల్లో కొత్త లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నేరగాళ్లకు ఆశ్రయం కల్పించడం కూడా నేరమేనని



స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన అవసరమైన పత్రాలు వెంట ఉంచుకోవాలని, లేకపోతే వాహనాలను సీజ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. యువత అసాంఘిక కార్యకలాపాలు, వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును సురక్షితంగా నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్డెన్ సెర్చ్ కార్యక్రమం ప్రజల రక్షణ కోసమే నిర్వహించబడిందని, నేరాలను ముందస్తుగా అరికట్టడమే దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం కాలనీవాసులకు చట్టాలపై అవగాహన కల్పించి, పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చందోలు పోలీస్ సిబ్బంది, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశాల ప్రకటన విడుదల

**జిల్లా కలెక్టర్ చేత పోస్టర్ల ఆవిష్కరణ**
**మార్చి 31 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**గుంటూరు రక్షణ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గురుకుల విద్యాసంస్థల్లో 2026--27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 5వ తరగతి ప్రవేశాలతో పాటు 6, 7, 8 తరగతులలో మిగిలిన సీట్లకు, అలాగే ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు మార్చి 31 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఏప్రిల్ 24న రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశ పరీక్షలు నిర్వహించబడతాయని వెల్లడించారు. ప్రవేశ పరీక్షల నిర్వాహకుడు, గుంటూరు గురుకుల జూనియర్ కళాశాల (ఉర్దూ బాలురు) ప్రధానాచార్యులు పి. సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలు, జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ముస్లిం మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ-బి, బీసీ-సి వర్గాలకు చెందిన విద్యార్థులు అర్హులని



తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రవేశాలకు రాష్ట్ర జూనియర్ కళాశాలల సాధారణ ప్రవేశ పరీక్ష, డిగ్రీ ప్రవేశాలకు డిగ్రీ కళాశాలల సాధారణ ప్రవేశ పరీక్ష నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 18 నుండి మార్చి 31 వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2025--26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అర్హులని స్పష్టం చేశారు. గుంటూరు గురుకుల జూనియర్ కళాశాల (ఉర్దూ బాలురు)లో ఎం.పి.సి, బయోలజీ, సి.ఇ.సి విభాగాల్లో సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో వైద్య, ఇంజినీరింగ్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ అందించబడు తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గురుకుల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన

**విద్యార్థిని బషీరాకు న్యాయం చేయాలని డిమాండ్**

**నరసరావుపేట రక్షణ న్యూస్**

నరసరావుపేటలో డీఈవో కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాలు, బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఇటీవల ప్రకాష్ నగర్‌లోని ఆక్స్ఫర్డ్ ప్రైవేట్ పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించిన ఘటనకు కొనసాగింపుగా ఈ నిరసన చేపట్టారు. బాధిత విద్యార్థిని బషీరాను ఎటువంటి కారణం లేకుండా పాఠశాల ప్రిన్సిపల్ శంకర్ రెడ్డి అన్యాయంగా కొట్టారని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనపై గత రెండు రోజుల క్రితం పాఠశాల ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం బాధితురాలి కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘ నాయకులు కలిసి ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ప్రిన్సిపల్‌పై కేసు నమోదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఘటనపై విద్యాశాఖాధికారులు



దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. అయితే దర్యాప్తులో తప్పుడు నివేదిక ఇచ్చారని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాలు, బాధితులు డీఈవో కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. తప్పుడు నివేదిక ఇచ్చిన డిప్యూటీ డీఈవో మహబూబ్ సుభానీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థిని బషీరాకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు తమ నిరసన వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# శ్రీనగర్ లో దొంగల బీభత్సం

**భద్రత లోపల బారిన పడిన ప్రజలు**

**గుంటూరు రక్షణ న్యూస్**



గుంటూరు శ్రీనగర్ ప్రాంతంలో వరుస దొంగతనాలు ప్రజల్లో భయాందోళన సృష్టిస్తున్నాయి. గత వారం రోజులుగా జరుగుతున్న చోరీ ఘటనలు పోలీసు వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రజల భద్రతను కాపాడాల్సిన పోలీసుల రాత్రి పర్యవేక్షణ లోపమే ఈ దొంగతనాలకు ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజాగా నేడు ఉదయం 6 గం టలకు లేచి చూసిన ఓ కుటుంబం తమ ఇల్లు పూర్తిగా ఖాళీ అయినట్లు గుర్తించింది. తెల్లవారుజామున దొంగలు ఇంట్లోకి చొరబడి నగదు, బంగారం తదితర విలువైన వస్తువులను అపహరించినట్లు తెలుస్తోంది. రాత్రి వేళల్లో గస్తీ లేకపోవడంతో దొంగలు సులభంగా కాలనీల్లో సంచరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నప్పటికీ భద్రతా చర్యలు కఠినతరం కాలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే రాత్రి గస్తీ పెంచి, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది. ప్రాంతంలో అదనపు బలగాలను మోహరించి నిందితులను పట్టుకునేందుకు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

# ఆధ్యాత్మిక వేడుకలలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

**వేమూరు నియోజకవర్గంలో పలు మండలాల దేవాలయాల్లో ప్రత్యేక పూజల లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు.**

**కొల్లూరు రక్షణ న్యూస్**



కొల్లూరు, వేమూరు మండలాల్లో నిర్వహించిన ఆధ్యాత్మిక మహోత్సవాల్లో వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు, మాజీ మంత్రివర్యులు నక్కా ఆనందబాబు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. రెండు గ్రామాల్లో జరిగిన దేవాలయ కార్యక్రమాలకు ఆయన హాజరు కావడంతో భక్తుల్లో ప్రత్యేక ఉత్సాహం నెలకొంది. కొల్లూరు మండలం క్రాప గ్రామంలో శ్రీ సీతారామలక్ష్మి ఆంజనేయ స్వామి విగ్రహ జీర్ణోద్ధరణ మహా కుంభాభిషేకంలో నక్కా ఆనందబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం వేమూరు మండలం కుచ్చెళ్లపాడు గ్రామంలో శ్రీ గాజులవారి ఇలవేల్పు శ్రీ వీరనాగమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని పూజా కార్యక్రమాల్లో భాగమయ్యారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన శాస్త్రోక్త కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సక్రియంగా పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు సమాజానికి ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తాయని, ప్రజల్లో సత్సంకల్పాలు పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. అనంతరం జరిగిన హారతులు, మంగళవాయిద్యాలు, అన్నదాన కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొని భక్తులతో కలిసిమెలిసి ముచ్చటించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేశారు.

27-2-26 RAKSHANA_praja jyothi Medhak.qxd 2/27/2026 5:06 AM Page 4



# ప్రజా శ్రేయస్సే పవన్ లక్ష్యం

**పవన్ ఆశయాలే నా లక్ష్యం**

**పవన్ సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే నా నాయకత్వం**



**బాపట్ల రక్షణ న్యూస్**

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం బాపట్లలో రాజకీయ ఉత్సాహాన్ని నింపింది. పట్టణంలోని పటేల్ నగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బాపట్ల నియోజకవర్గ జనసేన నాయకుడు విన్నకోట సురేష్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా విన్నకోట సురేష్ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ ప్రతిపాదిస్తున్న స్వచ్ఛ రాజకీయాలు, పారదర్శక పరిపాలన, యువతకు అవకాశాలు వంటి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఉద్యమి సభ్యత్వం ద్వారా పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేర్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. జనసేనను బలమైన ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దడమే తమ సంకల్పమని, సభ్యత్వ నమోదు కేవలం సంఖ్య పెంపు కార్యక్రమం కాదని, అది సిద్ధాంతాల విస్తరణ యజ్ఞమని పేర్కొన్నారు. బాపట్ల నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసి రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలవాలని కృషి చేస్తున్నామని చెప్పారు.

పవన్ కళ్యాణ్ పిలుపుకు యువత, మహిళలు, సామాన్య ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. జనసేన పార్టీ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని, కార్యకర్తలే పార్టీకి బలమని విన్నకోట సురేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జిల్లాలో 20 కేంద్రాల్లో నీట్ పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం

**మే 3న 1,650 మంది అభ్యర్థులు హాజరు**

**గుంటూరు రక్షణ న్యూస్**



జిల్లాలో మే 3న నిర్వహించనున్న నీట్ పరీక్షకు సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. గుంటూరు, తెనాలి, మంగళగిరి, అమరావతి పట్టణాల్లో మొత్తం 20 పరీక్షా కేంద్రాలను గుర్తించినట్లు వెల్లడించారు. గురువారం న్యూ ఢిల్లీ నుండి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరీక్ష నిర్వహణపై సమీక్షించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 20 కేంద్రాల్లో సుమారు 1,650 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు భద్రత, మౌలిక సదుపాయాలు, తాగునీరు, విద్యుత్ వంటి ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేపట్టినట్లు చెప్పారు. సంబంధిత శాఖల సమన్వయంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజా వలి, నీట్ కన్వీనర్లు పాల్గొన్నారు.

# అలసత్వానికి చెక్ కలెక్టర్ కీలక ఆదేశాలు

**తప్పులు లేని మ్యుటేషన్ చేయడమే లక్ష్యం: గడువులోపు పరిష్కారం, రీ సర్వేకు వేగం -- జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా**

**గుంటూరు రక్షణ న్యూస్**




మ్యుటేషన్ ప్రక్రియను ఎటువంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో నిర్వహించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. మ్యుటేషన్ దరఖాస్తులను ఒకటికి రెండు సార్లు పరిశీలించి తప్పుల్లేకుండా పూర్తి చేయాలని, అదే సమయంలో నిర్దేశిత గడువులో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. మ్యుటేషన్ రెవెన్యూ శాఖకు ప్రాథమిక విధి అని పేర్కొంటూ, చిన్న తప్పిదం జరిగినా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని హెచ్చరించారు. విధుల నిర్వహణలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని, అలసత్వం గమనిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కొనసాగుతోందని, వాటిలో ఎటువంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో సానుకూల దృక్పథం కనీసం 80 శాతం వరకు పెరగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజలతో అధికారులు, సిబ్బంది ప్రవర్తించే తీరు పరిపాలనపై ప్రభావం చూపుతుందని గమనించాలని సూచించారు. గ్రామాలలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను సమగ్రంగా డాక్యుమెంటేషన్ చేయాలని, 9(2) నోటీసులు తప్పనిసరిగా జారీ చేయాలని, ఫిర్యాదులపై స్పీకింగ్ ఆర్డర్లు ఇవ్వాలని ఆదేశించారు. రీ సర్వే జరగని మండలాల నుంచి అవసరమైన సర్వేయర్లను డిప్యూటేషన్‌పై పంపించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. భూ వివాదాలకు సంబంధించిన కోర్టు కేసులపై తక్షణ స్పందన ఇవ్వాలని, కేసుల పూర్వాపరాలు పూర్తిగా అధ్యయనం చేసి పూర్తి ఆధారాలతో నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను నిర్దేశిత సమయంలోనే పరిష్కరించాలని, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజా వలి, డిప్యూటీ కలెక్టర్లు గంగ రాజు, లక్ష్మి కుమారి, తహసిల్దార్లు పాల్గొన్నారు.

# మెడికల్ ఎక్స్పో సందర్శించిన కలెక్టర్

**గుంటూరు రక్షణ న్యూస్**



గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన వైద్య విజ్ఞాన ప్రదర్శన (మెడికల్ ఎక్స్పో)ను గురువారం జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా సందర్శించారు. ప్రదర్శన ఏర్పాటుపై కళాశాల ప్రిన్సిపాల్‌ను అభినందిస్తూ, ఇది ఎంతో విజ్ఞానదాయకంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తిలకించదగిన ప్రదర్శనగా అభివర్ణించారు. ముఖ్యంగా విద్యార్థులకు ఇది అత్యంత ప్రయోజనకరమని, వైద్య విద్యపై ఆసక్తి పెంపొందించడంలో దోహదపడుతుందని తెలిపారు.

కళాశాల ప్రిన్సిపాల్ సుందరాచారి ప్రదర్శనలో ఉంచిన విభాగాల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. సాధారణ వ్యాధులు అయిన రక్తపోటు, మధుమేహం, వడదెబ్బ, ప్రమాదాలు, విషసర్పాల కాట్లు వంటి అంశాలతో పాటు అనాటమీ, ఫోరెన్సిక్, న్యూరాలజీ, కిడ్నీ, క్యాన్సర్ తదితర విభాగాలకు సంబంధించిన శరీర అవయవ నిర్మాణ నమూనాలు, విద్యార్థులకు బోధన విధానాలు ప్రదర్శించబడ్డాయి. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఆసక్తిగా ప్రదర్శనను తిలకిస్తున్నారు. ఫిబ్రవరి 2వ తేదీ నుండి కొనసాగుతున్న ఈ ప్రదర్శన ఈ నెల 28న ముగియనుంది. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ఆచార్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా రక్షనే పోలీస్ లక్ష్యం

**జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ వజ్ర ప్రహార్ పేరుతో పల్లెల నుండి పట్టణాల వరకు పోలీసుల ముమ్మర తనిఖీలు...**

**జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఐపీఎస్ కఠిన ఆదేశాలు -- 40 ద్విచక్ర వాహనాల సీజ్**

**బాపట్ల రక్షణ న్యూస్**



బాపట్ల సబ్‌డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు విస్తృత స్థాయిలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు పోలీసు బృందాలు వివిధ కాలనీలు, గ్రామాల్లో తనిఖీలు చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో మొత్తం 40 ద్విచక్ర వాహనాలను సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. బాపట్ల టౌన్‌లో 10, రూరల్‌లో 3, చందోలు 3, కర్లపాలెం 5, పర్చూరు 12, యద్దనపూడి 7 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా వేదుళ్లపల్లి పరిధిలోని స్టూవర్టుపురం గ్రామంలో ఒక మహిళ ఇంటి వద్ద 4 లీటర్ల నాటు సారా పట్టుబడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఎస్పీ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ ఆదేశాలతో "ఆపరేషన్ వజ్రప్రహార్"లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టామని తెలిపారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా టోల్ ఫ్రీ నెంబర్ 112కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజల భద్రత కోసమే ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎస్పీ ఉమామహేశ్వర్ స్పష్టం చేశారు.